క్లుప్తంగా

మేడిపెల్లిలో బైపాస్ రోడ్డు నిర్మించాలి


ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కథలాపూర్: మేడిపెల్లి మండలకేంద్రంలో జాతీయ రహదారి–63 కి బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఫోర్‌లేన్ రోడ్డు నిర్మిస్తున్నందునా మేడిపెల్లి పరిధిలో 2 కిలోమీటర్ల దూరం నివాసాలున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల మాదిరిగా మేడిపెల్లిలో బైపాస్ రోడ్డును నిర్మించేలా కృషి చేయాలని ఎంపీకి విన్నవించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు

హిందూ ఏక్తాయాత్రకు తరలిన నాయకులు


కరీంనగర్ వెళ్తున్న బీజేపీ నాయకులు

కథలాపూర్: కరీంనగర్‌లో నిర్వహిస్తున్న హిందూ ఏక్తాయాత్రకు కథలాపూర్ మండలంలోని బీజేపీ నాయకులు ఆదివారం తరలివెళ్లారు. ఆయా గ్రామాల నుంచి నాయకులు వాహనాల్లో కథలాపూర్‌కు చేరుకున్నారు. కథలాపూర్ నుంచి వాహనాల ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, ఎడ్మల వినోద్‌రెడ్డి, బద్రి సత్యం, రవీందర్‌రెడ్డి, బండ అంజయ్య, భైర మల్లేశ్, సోమల్ల శంకర్, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.
మేడిపెల్లి, భీమారం మండలాల్లోని బీజేపీ నాయకులు ఆదివారం కరీంనగర్ తరలివెళ్లారు. హిందూ ఏక్తా యాత్రలో పాల్గొనేందుకు రెండు మండలాల్లోని బీజేపీ నాయకులు వాహనాల్లో ర్యాలీగా బయలుదేరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ముంజ శ్రీనివాస్, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఎల్‌ఎం ట్రస్టు చేయూత


నగదు, చీర అందిస్తున్న నాయకులు

గొల్లపల్లి: మండలంలోని లొత్తునూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన శాఖాపురం లచ్చయ్య, రమ దంపతుల కూతురు గంగా వివాహం కోసం ఎల్‌ఎం చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్, మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత రూ.10 వేలు, చీర కట్నంగా పంపించడంతో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కటారి రామేశ్వర్ రావు, మండల అధ్యక్షుడు బొల్లం రమేశ్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాంచందర్ రెడ్డి, రాజేందర్, ఎంపీటీసీ కాళ్ల సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి


మాట్లాడుతున్న వాకిటి సత్యంరెడ్డి

మల్లాపూర్: అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం చెల్లించాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి అన్నారు. మండలంలోని ముత్యంపేటలో ఆదివారం మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని పీసీసీ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు సోమవారం కొనుగోళ్లు, పంటపరిహారంపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సభ్యులు, అన్ని మండలాల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు తరలిరావాలని కోరారు. సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శశిందర్‌రెడ్డి, తోట సంతోష్ పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత

రాయికల్: మండలంలోని తాట్లావాయి గ్రామానికి చెందిన గడ్డం మల్లీశ్వరీ– రమేశ్‌ల కూతురు పూజిత వివాహం ఆదివారం జరగగా కరీంనగర్ పాల డెయిరీ ఆధ్వర్యంలో వధువుకు పుస్తెమెట్టెలను ఎంపీపీ లొద్ది సంధ్యారాణి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేశ్, చైర్మన్ మహిపాల్, కార్యదర్శి రవి, తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లయినా రోడ్డు పూర్తి కాలే..

- అనుమతి ఇవ్వని అటవీ శాఖ అధికారులు
- రోడ్డు పనులకు అనుమతులు ఇవ్వాలని ప్రజల విజ్ఞప్తి
- రోడ్డు పూర్తయితే తీరనున్న ప్రజల ఇబ్బందులు


కోజన్‌కొత్తూర్ - వేములకుర్తి మధ్య నిలిచిపోయిన బీటీ రోడ్డు పనులు

ఇబ్రహీంపట్నం: నాలుగున్నర ఏళ్లుగా లింకు రోడ్డు పనులు పనులు పూర్తి కాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అటవీ శాఖ అధికారులు అనుమతి ఇవ్వక, అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. మండలంలోని కోజన్‌కొత్తూర్ నుంచి వేములకుర్తికి వెళ్లే లింకు రోడ్డు పనులు మధ్యలో ఫారెస్ట్ ఉండడంతో అటవీ శాఖ అధికారులు పనులు ఆపివేశారు. కోజన్‌కొత్తూర్ నుంచి వేములకుర్తి లింకు రోడ్డు బీటీ రోడ్డుగా చేసేందుకు గాను బీఎంఎఫ్‌టీ నిధులు రూ. 220.40 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. సెప్టెంబర్, 2018లో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పనులకు శంకుస్థాపన చేశారు. టెండర్లను సాయిరాం కన్‌స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుని పనులు చేపట్టింది. లింకు రోడ్డు కొజన్‌కొత్తూర్ నుంచి వేములకుర్తికి 2.1 కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు వేయగా, అటవీ ప్రాంతంలో ఉన్న 1.7 కిలోమీటర్లలో అటవీ అధికారులు అనుమతి లేదంటూ పనులు నిలిపివేశారు. కల్వర్టుల కోసం కాంట్రాక్టర్ పైపులు వేసేందుకు తవ్వగా అధికారులు కేసు నమోదు చేసి రూ. 51 వేలు జరిమానా విధించారు. దీంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. కొన్నేళ్ల నుంచి ఈ రోడ్డుపై మెటల్ రోడ్డు వేసినప్పుడు అభ్యంతరం తెలపని అధికారులు నేడు బీటీ రోడ్డు పనులు చేపడితే అనుమతి లేదంటూ ఆపివేయడంతో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. 2.1 కిలోమీటర్ల బీటీ రోడ్డు పూర్తి కావడంతో కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం రూ. 1 కోటి బిల్లులు చెల్లించింది.

తగ్గనున్న దూరభారం

ఈ రోడ్డు పూర్తయితే మండలంలోని వేములకుర్తి, బర్దిపూర్, మూలరాంపూర్ గ్రామాల ప్రజలు, రైతులు మండల కేంద్రానికి రావడానికి దూర భారం తగ్గుతుంది. ఈ లింకు రోడ్డు పూర్తి కానందునా మూడు గ్రామాల ప్రజలు, రైతులు యామాపూర్, తిమ్మాపూర్, గోధూర్ మీదుగా ఇబ్రహీంపట్నం రావడానికి 16 కిలోమీటర్ల దూరం పడుతుంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే మండల కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరం పడుతుంది. అధికారులు చొరవ చూపి ఫారెస్ట్ అధికారులు రొడ్డును వేసేందుకు అనుమతి ఇవ్వాలని వేములకుర్తి ప్రజలు కోరుతున్నారు.

దూరం తగ్గుతుంది



లింకు రోడ్డు పూర్తయితే మండల కేంద్రానికి రావడానికి మూడు గ్రామాల ప్రజలకు, రైతులకు మేలు జరుగుతుంది. ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకుని నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి.

– రాధారపు దేవదాస్, వేములకుర్తి

అనుమతి ఇవ్వాలి



అటవీ శాఖ అధికారులు రోడ్డు పనులకు వెంటనే అనుమతి ఇవ్వాలి. కొన్నేళ్ల నుంచి ఫారెస్ట్ లింకు రోడ్డు ఉంది. బీటీ రోడ్డు పనులు నడుస్తుండగా అటవీ శాఖ అధికారులు పనులను నిలిపివేయడం దారుణం. ప్రజల సౌకర్యార్థం వెంటనే అనుమతులు ఇవ్వాలి.

– నున్నం నవ్యశ్రీ, సర్పంచ్, వేములకుర్తి

జాయింట్ సర్వే చేశాం



ఫారెస్ట్‌లో ఎంత పొడవు రోడ్డు ఉందో, ఎన్ని చెట్లు పోతున్నాయో అటవీశాఖ అధికారులతో కలిసి జాయింట్ సర్వే చేశాం. కానీ రోడ్డు నిర్మాణంలో ఎంత నిర్మాణం కోల్పోతుందో అంత భూమి రెవెన్యూ అధికారులు అటవీశాఖ అధికారులకు అప్పగిస్తే అనుమతులు వచ్చి రోడ్డు పూర్తవుతుంది.

నిరంజన్‌రెడ్డి, ఏఈ, పంచాయతీరాజ్

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

• ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మల్లాపూర్: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో రేణుకాఎల్లమ్మ ఆలయ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్ర పాలకుల నిర్లక్ష్యంతో నిరాధరణకు గురైన ఆలయాలకు సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. జిల్లాలోని ఆలయాల అభివృద్ధికి ఎమ్మెల్సీ కవిత చొరవ తీసుకుని సీఎం కేసీఆర్‌కి విన్నవించగా, రూ.3 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారన్నారు. ఆలయ నిర్మాణానికి తనవంతు సహాయాన్ని అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ బద్దం సరిత, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఏలేటి మహేష్‌రెడ్డి, నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డి, బద్దం కమలాకర్‌రెడ్డి, బద్దం నర్సారెడ్డి, గౌడ కులసంఘం సభ్యులు, బీజేపీ రాష్ట్ర నాయకుడు పూదరి నిషాంత్ కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా భీమన్న విగ్రహ ప్రతిష్ఠాపన

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ భీమన్న ఆలయంలో నూతనంగా భీమేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు,గణపతిపూజ, బలిహరణ నిర్వహించారు.అనంతరం భీమన్న కల్యాణం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాంగౌడ్, ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక, గుగ్గిళ్ల సురేశ్ గౌడ్,ఉప సర్పంచ్ రాజం, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గోపు ప్రశాంత్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రావు

జగిత్యాలజోన్: జిల్లా రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ అసోసియేషన్ జగిత్యాల యూనిట్–1 అధ్యక్షుడిగా వోరుగంటి ప్రభాకర్ రావు ఆదివారం నియమితులయ్యారు. ఈ మేరకు నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఎంప్లాయిస్‌లకు అన్ని రకాల సేవలు అందించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎల్ల గంగారాజం, ప్రధాన కార్యదర్శి కరబూజ రవీందర్, మాజీ అధ్యక్షుడు పెద్ది ఆనందం, రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, సెక్రటరీ చంద శేఖర్ అభినందనలు తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో ఆదివారం రాత్రి గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. రేణుకాఎల్లమ్మ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా పోచమ్మ బోనాలు నిర్వహించినట్లు వారు తెలిపారు. బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల్లో గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెగడపల్లి: మండల కేంద్రం పెగడపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో 2003–04 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే చోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా బాల్య మిత్రులంతా వారి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి హెచ్‌ఎం భగవద్దాస్, ఉపాధ్యాయులు కిషన్‌రావు, సదాశివ, శ్రీనివాస్, రమేశ్, భారతలక్ష్మీ, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, అటెండర్ సూరమ్మలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుపతినాయక్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

‘వెల్గటూర్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?’

వెల్గటూర్: వెల్గటూర్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని బీఆర్‌ఎస్ మండలనాయకులు డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు సవాల్ విసిరారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడారు. వెల్గటూర్‌లో అభివృద్ధి ఏం జరగలేదని మాట్లాడడం విడ్డూరమని, గౌడ కులస్తులకు, మత్స్యకారులకు ఎటువంటి అన్యాయం జరగలేదని అన్నారు. వెల్గటూర్ వస్తే వస్తే అభివృద్ధి ఏమిటో చూపిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పత్తిపాక వెంకటేశ్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, సింగిల్ విండో అధ్యక్షుడు గోళి రత్నాకర్, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

వెల్గటూర్: యాసంగి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జగిత్యాల అదనపు కలెక్టర్ బీఎస్ లత ఆదేశించారు. ఆదివారం జిల్లా పౌర సరఫరాల మేనేజర్, పౌర సరఫరాల ఇన్‌స్పెక్టర్లతో కలిసి వెల్గటూర్, బుగ్గారం మండలాల్లో కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లులను సందర్శించారు. ఈ సందర్భంగా నాణ్యతా ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కొనుగోలు చేస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యంను కోతలు విధించకుండా దిగుమతి చేసుకోవాలని మిల్లర్లను ఆదేశించారు. అలాగే లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు మిల్లులో దిగుమతి చేసిన వెంటనే కొనుగోలు కేంద్రాలకు చేరుకుని రైతులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశాలు జారీచేశారు.ఆమె వెంట పలువురు అధికారులు ఉన్నారు.


నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

తూకంలో నిబంధనలు అతిక్రమించొద్దు

బుగ్గారం: ధాన్యం తూకంలో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించరాదని అడిషనల్ కలెక్టర్ బీ.ఎస్ లత అన్నారు. మండలంలోని మద్దునూర్‌లోని వరి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని పరిశీలించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రైతులకు మద్దతుధర కల్పిస్తుందని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం రజినీకాంత్, సర్పంచ్ తిరుపతి, గాలిపెల్లి మహేశ్, సీఈవో అయ్యోరి రాజేశ్, రైతులు తదితరులున్నారు.

వేసవి సెలవుల్లో పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలి

జగిత్యాలజోన్: వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు పదోన్నతులు,బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. శ్యామ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జగిత్యాల జిల్లా కమిటీ కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యారంగంలో నెలకొన్న పరిస్థితులతో ఉపాధ్యాయులు, విద్యార్థులకు న్యాయం జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, విద్యా సంవత్సరం అస్తవ్యస్తంగా నడుస్తుందన్నారు. పదోన్నతులు, బదిలీలతోనే ఖాళీ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్నం రాంరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు నీలం సంపత్, మురళి, గంగరాజం, రాజేందర్, రవీందర్ రెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

కథలాపూర్: ఇంటర్, పదోతరగతి విద్యార్థులు ఫలితాల్లో ప్రతిభ చూపిన సిరికొండ గ్రామానికి చెందిన విద్యార్థులను ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులు సన్మానించారు. మోడల్‌స్కూల్‌లో టాపర్‌గా నిలిచిన సుదవేని హర్షిత్, ఇంటర్ సెకండియర్‌లో 985 మార్కులు సాధించిన బోయిని అభిత, ఫస్టియర్‌లో 449 మార్కులు సాధించిన రాధారపు హర్షితను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దొప్పల హైమావతి, నాయకులు దొప్పల జలంధర్, ముంజ దశాగౌడ్, నర్సయ్య పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఇంటర్, పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన మండలంలోని తిమ్మాపూర్, వేములకుర్తి గ్రామాలకు చెందిన విద్యార్థులను సర్పంచ్ నేరేళ్ల హేమలత, ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కార్యక్రమాల్లో పాఠశాల హెచ్‌ఎం మహేశ్‌కుమార్, లక్ష్మీ నారాయణ, గణేష్, ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు అరె నరేందర్, నాయకులు సత్యం, దేవదాస్, ప్రేమ్‌కుమార్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

‘స్వర్ణకారులను ఆదుకోవడంలో విఫలం’

మెట్‌పల్లి: స్వర్ణకారులను ఆదుకోవడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరు రాఘవచారి విమర్శించారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వర్ణకారులకు లబ్ధి కలిగేలా ప్రభుత్వం ఎలాంటి పథకాలను అమలు చేయడం లేదన్నారు. ఉపాధి దెబ్బతినడంతో గడిచిన ఆరునెలల్లో సుమారు 11మంది బలవన్మరణాలకు పాల్పడ్డారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో స్వర్ణకారులు క్రియాశీలకంగా వ్యవహరించారని అన్నారు. శ్రీకాంతాచారి ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. సబ్సిడీ రుణాలు అందించి ఆదుకోవాలని ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినప్పటికీ స్పందన లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే తగిన సమయంలో తగిన విధంగా గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇల్లెందుల కృష్ణమాచారి తోపాటు నాయకులు రాగిపెల్లి సతీశ్, నాగరాజు, వంగ మహేశ్, ప్రవీణ్, ఇల్లెందుల శ్రీధర్, తాడూరి శ్రీను, వంగ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా హనుమాన్ జయంతి


ఏడుమోటలపల్లిలో హనుమాన్ భక్తుల పూజలు

పెగడపల్లి: హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని బతికపల్లి కొచ్చెరువు గట్టు హనుమాన్, పెగడపల్లి, ఏడుమోటలపల్లి తాండా హన్‌మాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీటీసీ అంజయ్య, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండ, కథలాపూర్ గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సిరికొండలో పంచముఖ ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జెడ్పీటీసీ భూమయ్య, సర్పంచ్ గాండ్ల వీణ, ఎంపీటీసీ హైమావతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా మార్కండేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో శ్రీ మార్కండేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. సత్యానందాశ్రమాల ఇనుమడుగు పీఠాధిపతి శ్రీహరి తీర్థస్వామి చేతులమీదుగా స్వామివారి ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరిగింది. ఈ ఉత్సవాల్లో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, గోలి మోహన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగం భూమయ్య, సర్పంచ్ గడీల గంగప్రసాద్, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, పద్మశాలీలు, భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న భక్తులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు యంత్ర, విగ్రహ, శిఖర సహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎంపీపీ మసర్తి రమేష్, జెడ్పీటీసీ పాత పద్మ, వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, సర్పంచ్ గుడిసె శ్రీమతి, ఎంపీటీసీ మల్లీశ్వరి, భక్తులు పాల్గొన్నారు.

జగిత్యాలకు ప్రతినెలా రూ. 5 కోట్ల సంక్షేమ నిధులు

• ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: పట్టణంలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు ప్రతి నెల రూ. 5 కోట్లు ప్రభుత్వం ప్రజలకు అందిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణంలోని 7వ వార్డులో టీయూఎఫ్ఐడీసీ కింద రూ. 19 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్ల నిర్మాణానికి, రూ.4 లక్షలతో చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులను ఆయన భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వం ఒక్క జగిత్యాల పట్టణంలో ప్రతి నెల రూ. 5 కోట్లు అందిస్తుందన్నారు. 7వ వార్డులో ఇప్పటి వరకు రూ. 90 లక్షలతో వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ రేణుక, ప్రేమలత, కమిషనర్ డాక్టర్ నరేశ్ తదితరులు ఉన్నారు.


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అధికారంలోకొస్తే అన్ని పంటలకు గిట్టుబాటు ధర

• ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతీ పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. వరి ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ.2,500 చెల్లించి కొనుగోలు చేస్తామని, పసుపు పంటను క్వింటాల్‌కు రూ.15 వేలతో కొనుగోలు చేసి మద్దతు ధర కల్పిస్తామన్నారు. రైతులు అధిక దిగుబడి కోసం ప్రభుత్వం సర్టిపై చేసిన దొడ్డు రకం ధాన్యాన్ని ఏ గ్రేడ్ కింద కొనుగోలు చేసేందుకు మిల్లర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని, అధికారులు దృష్టి సారించాలన్నారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ కోండ్ర రాం చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ న్యారబోయిన గంగాధర్, నాయకులు పురుమల్ల లక్ష్మారెడ్డి, శేఖర్, కర్నె అంజిరెడ్డి, కొక్కు గంగారాం, కాలగిరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం... తిమ్మాపూర్ గ్రామ శివారులో జగిత్యాల–గొల్లపల్లి ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనం, కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలుకాగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన నేరేళ్ల అజయ్, తండ్రి గంగన్న వివాహ వేడుకకు హాజరై ద్విచక్రవాహనంపై తిరిగి ఇంటికి వెళ్తున్నారు. జాబితాపూర్‌కు చెందిన మహిపాల్ తన కారులో చిన్న గట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి వస్తుండగా ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అజయ్, తండ్రి గంగన్నకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అజయ్, గంగన్నను 108లో జగిత్యాల ప్రభుత్వాస్పత్రికి, అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు.

లేత జొన్న గడ్డి తిని 8 గేదెలు మృతి

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో ఆదివారం లేత జొన్న గడ్డి తిని 8 గేదెలు మృతి చెందాయి. పశువుల కాపరి గేదెలను మేపేందుకు గ్రామ శివారులోని వ్యవసాయ భూములకు వెళ్లగా లేత జొన్న తినడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు రైతులు తెలిపారు. పుస్తెం మహేందర్, పత్తిరెడ్డి సంసోన్, కొక్కు ప్రవీణ్, పుస్తెం అరుణ్, పత్తిరెడ్డి రాంరెడ్డి, ఓర్రె మహేందర్ కు చెందిన ఒకొక్క గేదె, పుస్తెం రాజేందర్‌కు చెందిన 2 గేదెలు మృతి చెందాయి. పశువైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి 3 పశువుల పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యం చేసినప్పటికీ అవి కూడ మృతి చెందాయి. లేత జొన్న గడ్డిలో సైనైడ్ అనే విషపూరిత రసాయనం ఉంటుందని ఈ గడ్డి తినడం వలన పశువుల రక్తం విషపూరితం అయి మృతి చెందుతాయని పశువైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని లేగ దూడ మృతి

ధర్మపురి: గుర్తు తెలియని వాహనం ఢీకొని లేగ దూడ మృతి చెందింది. హన్మాన్ జయంతి సందర్భంగా ఆదివారం వాహనాల రద్దీ ఎక్కువైంది. ధర్మపురిలోని దుర్గమ్మ కాలనీ వద్ద నున్న చిన్న లేగదూడను వాహనం ఢీకొట్టి వెల్లగా అది అక్కడికక్కడే మృతి చెందింది. ఈ దూడ ఎవరిదో తెలియలేదు. విషయం తెలిసిన వెంటనే మున్సిపల్ సిబ్బంది లేగదూడను ఖననం చేశారు.